నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న గడ్డె యాదగిరి

మైలార్‌దేవ్‌పల్లి: ఆరోగ్య విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఆర్థిక సహాయం అందించాలని మార్కండేయనగర్ శ్రీసత్య సాయి పొదుపు సంఘం వ్యవస్థాపకుడు గడ్డె యాదగిరి సభ్యులకు సూచించారు. మార్కండేయనగర్ కాలనీలో నివసిస్తున్న పవన్ సెంట్రింగ్ మెస్త్రీగా పని చేసేవాడు. కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన చికిత్స నిమిత్తం రూ.30వేల ఖర్చవుతాయని కాలనీపెద్దలకు తెలిపాడు. మానవత దృక్పథంతో ముందుకొచ్చిన గడ్డె యాదగిరి సంఘం అధ్యక్షుడు పగిడిమర్రి సూర్యనారాయణ సమక్షంలో బుధవారం వారి కుటుంబానికి రూ.30వేల ఆర్థిక సాయం చేశారు.

మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కె.కృష్ణమాచారి, అక్కిరాజు రాజేశం బుధవారం మంత్రి సీతక్కను కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు చిత్రపటాన్ని బహూకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో బోనాల ఉత్సవాలు



అమ్మవారి పూజల్లో ఉద్యోగులు, సిబ్బంది

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో బుధవారం బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలోని అమ్మవారి దేవాలయాన్ని చూడముచ్చటగా అలంకరించారు. ఉద్యోగులు అమ్మవారికి బోనం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఉద్యోగులతో పాటు అధికారులు పాల్గొన్నారు.

మొయినాబాద్ ఎంపీటీసీ స్థానాలు ఖరారు

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలలో 9 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేశామని ఎంపీడీఓ సంధ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఎంపీటీసీ స్థానాల వివరాలను అందుబాటులో ఉంచారు. మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలలో 28 వేల9 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం గతంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 9 గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలో విలీనం అయ్యాయని పేర్కొన్నారు. జనాభా ప్రతిపాదికన ఎంపీటీసీ స్థానాలకు ఖరారు చేశామన్నారు.

ఆలయాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేయాలి

శాస్త్రిపురం: బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యేలోపు సులేమాన్‌నగర్ డివిజన్‌లోని అమ్మవారి దేవాలయాల వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఆలయాల కమిటీ సభ్యులు కోరుతున్నారు. ఈ మేరకు బుదవారం చింతల్‌మెట్, ఇంద్రనగర్ ఈదమ్మ, మైసమ్మ దేవాలయాల కమిటీ సభ్యులు సాక్షితో మాట్లాడారు. డివిజన్‌లోని అమ్మవారి దేవాలయాలు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. చింతల్‌మెట్‌లోని బోనాలు సమర్పించే ఆలయాలకు సమీపంలో ఉన్న చెత్త కుండిని తొలగించాలన్నారు. దీని కారణంగా భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అమ్మవారి దేవాలయాలకు వెళ్లే రహదారులపై ఉన్న గుంతలను పూడ్చివేయాలని బస్తీలలో ప్యాచ్ వర్క్‌లను పూర్తిచేయలన్నారు. రహదారులు గుంతలమయంగా ఉంటే బోనాలను తీసుకువెళ్లే మహిళలకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. నెల రోజుల నుంచి రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులకు సమస్యలపై ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాలయాల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట హైమాస్ట్ దీపాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. గత సంవత్సరం బోనాల సందర్భంగా ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని ఫలితంగా ఇబ్బందులకు గురైన సంగతి అధికారులకు కూడా తెలుస్సన్నారు. ఈనెల 20వ తేదీ వరకు సమయం ఉండడంతో ఆ లోపు బోనాల ఉత్సవాలకు సంబంధించిన అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేయాలని చింతల్‌మెట్ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

వర్షం కురిస్తేనే.. వన మహోత్సవం.!

- వర్షాలు కురవక మందకొడిగా సాగుతున్న పనులు
- నీటి సాకర్యం ఉన్న చోటనే మొక్కలు నాటుతున్న వైనం



మండలంలోని పెద్దతూప్ర తండాలో మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్న కూలీలు

శంషాబాద్ రూరల్: పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న వన మహోత్సవానికి వాన దేవుడు కరుణించడం లేదు. సరిపడ వానలు కురవకపోవడంతో నీళ్ల సదుపాయం ఉన్న చోట మాత్రమే మొక్కలు నాటుతున్నారు. మండలంలోని 21 పంచాయతీలకు గాను బోటిగూడ మినహా ఆయా పంచాయతీల్లో చెట్లు నాటేందుకు గుంతలు తవ్విస్తున్నారు. సరిపడ వర్షాలు కురిస్తే పూర్తి స్థాయిలో మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్థలాల కొరత..

లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు సరిపడ స్థలాలు దొరకడం లేదు. మరో వైపు లక్ష్యాన్ని కూడా కుదించారు. గతంలో పంచాయతీకి పది వేల మొక్కలను పెంచి, నాటాలని నిర్ణయించారు. తాజాగా పంచాయతీకి 8 వేల చొప్పున లక్ష్యం కాగా.. ఈ మేరకు మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ఖాళీ స్థలాలు దొరకడంలేదు.

- ▲ మల్కారం రెవెన్యూలో ఉన్న అటవీ భూముల్లో వన మహోత్సవం చేపట్టి భారీగా మొక్కలు నాటాలని నిర్ణయించినప్పటికీ.. భూమిలోఉన్న చెట్ల పొదలను తొలగించడానికి రూ.లక్షలు వెచ్చించాల్సి రావడంతో విరమించుకున్నట్లు సమాచారం.
- ▲ ఇక బోటిగూడ పంచాయతీ మినహా మిగిలిన 20 పంచాయతీల్లో లక్షా 60 వేల మొక్కల లక్ష్యానికి గాను 55,200 మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు.

ఉపాధి హామీ నిధులతో..

నర్సరీల్లో మొక్కల పెంపకం, నాటడం పనులను ఉపాధి హామీ నిధులతో చేపడుతున్నారు. నర్సరీల్లో పనుల్లో భాగంగా ప్లాస్టిగ్ బ్యాగుల్లో మట్టి నింపి, విత్తనాలు వేయడం మొదలు కొని ఎండ నుంచి మొక్కల సంరక్షణ కోసం షెడ్ నెట్ ఏర్పాటు చేశారు. ప్రతి నర్సరీకి వాచర్‌ను నియమించారు. కలుపు తీయడం, మొక్కలను నీళ్లు అందించడం వాచర్ పని. ఇందుకు వారికి నెలలో 25 రోజులు పని దినాలు కల్పిస్తున్నారు. ఒక రోజు కూలీ రూ.307 చెల్లిస్తున్నారు.

వర్షం కోసం ఎదురుచూపులు..

పూర్తిస్థాయిలో మొక్కలను నాటేందుకు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో వన మహోత్సవానికి జాప్యం జరుగుతుంది. రెండు రోజుల కిందట సీఎం ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దీంతో మండలంలో నీటి సాకర్యం ఉన్న చోట మొక్కలను నాటుతున్నారు. ఇప్పటి వరకు 7,300 మొక్కలను నాటారు.

- ➡ కవ్వగూడ, పాల్మాకులలో మూడు వేలకు పైగా మొక్కలను నాటినట్లు అధికారులు తెలిపారు. ఇక ఆయా గ్రామాల్లో 17,925 గుంతలను తీశారు. సరిపడ వానలు కురిస్తే పూర్తి స్థాయిలో మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 13.5 ఎకరాల్లో మొక్కలను నాటనున్నారు.



నర్సరీల్లో మొక్కలకు నీరు పోస్తున్న సిబ్బంది

29 రకాల మొక్కలు..

గ్రామాల్లోని నర్సరీల్లో 29 రకాలు మొక్కలను పెంచుతున్నారు. వీటిలో పూలు, పండ్లు, ఔషధ, సుగంధ ద్రవ్యాల మొక్కల రకాలు ఉన్నాయి. రోడ్ల వెంబడి, రైతుల పంట పొలాలు, ఇళ్ల వద్ద ఖాళీ స్థలాలు, ఇతర ఖాళీ స్థలాల్లో పెంచేందుకు అనువైన వాటిని పెంచుతున్నారు. దానిమ్మ, బొప్పాయి, సీతాఫలం, నిమ్మ, జామ, గంగరావి, గోరింటాకు. బాదం, పెల్టా పార్మ్, వేప, కృష్ణ తులసి, మారేడు, రావి, నెమలినార, నేరేడు, రైన్ ట్రీ, మల్బరీ, ఈత, సీమ చింత, ఆకేషియా, చింత, సరుగుడు, పచ్చగన్నేరు, రేలా, జువ్వి, కానుగ, నీలగిరి, కరివేపాకు రకాల మొక్కల పెంపకం చేపట్టారు.

ఆదర్శ డివిజన్‌గా అత్తాపూర్‌ను తీర్చిదిద్దేందుకు కృషి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నానని అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆమె బుధవారం పలు పనులకు శంకుస్థాపన చేశారు. హైదర్‌గూడ, లక్ష్మీనగర్‌లో సీసీ రోడ్డు పనులు, రాంబాగ్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం వద్ద సీసీ రోడ్లు, హైదర్‌గూడ శివనగర్‌లో కూడా సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అత్తాపూర్ డివిజన్‌ను గ్రేటర్‌లోనే ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొమరయ్య, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు వనం శ్రీరామ్ రెడ్డి, వనం నరసింహ, ఎస్.బి.హరినాథ్, శశికాంత్ శర్మ, విమల్ శర్మ, సంతోష్, జీహెచ్ఎంసీ అధికారులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

భారీ షెడ్ నిర్మాణ పనులను అడ్డుకోవాలి



నివాస ప్రాంతంలో భారీ షెడ్డు నిర్మాణ చేపడుతున్న దృశ్యం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ గగన్‌పహాడ్‌లోని నివాస ప్రాంతాలలో చేపడుతున్న భారీ షెడ్ నిర్మాణ పనులను వెంటనే అడ్డుకోవాలని తలారి అశోక్ బుధవారం జీహెచ్ఎంసీ ఉప కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గగన్‌పహాడ్ గ్రామంలోని సర్వే నం.6లోని ప్రైవేటు స్థలంలో భారీ పరిశ్రమ షెడ్డును నిర్మించేందుకు పనులను ప్రారంభించారని పేర్కొన్నారు. నివాస ప్రాంతాల్లో ఈ షెడ్ కారణంగా రానున్న రోజుల్లో ఇబ్బందులు ఏర్పడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏదైన ప్రమాదం జరిగితే గ్రామంలోని ప్రజలకు తీరని నష్టం జరుగుతుందని తెలిపారు. పారిశ్రామి కవాడలో షెడ్‌ను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఇదే విషయాన్ని అధికారులకు వివరించాని తెలిపారు.

బోనాల జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలి



డీసీ రవి కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బోనాల జాతరకు తగిన ఏర్పాట్లు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్ బుధవారం ఉపకమిషనర్ డాక్టర్ రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ... శివరాంపల్లి, రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లి, బుద్వేల్, ఎర్రబోడ తదితర ప్రాంతాల్లో శానిటేషన్, వీధి దీపాల నిర్వాహణ, రోడ్లు, గుంతలమయంగా మారిన రోడ్లకు ప్యాచ్ వర్క్, ఫాగింగ్ తదితర అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. పౌరుల ఆరోగ్యం, భద్రత, పండుగ ఉత్సాహానికి భంగం కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, సత్యనారాయణ ముదిరాజ్, కోరని సదానంద్, హరికిషన్ జీ, సోల్కర్‌రెడ్డి, బండారి బాలకృష్ణ, మల్లేష్ చారి, విజయ్ యాదవ్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద నిలవకుండా చర్యలు తీసుకుంటాం

రాజేంద్రనగర్ సర్కిల్ డీసీ రవికుమార్



వరదనీరు నిలిచే ప్రాంతాలను పరిశీలిస్తున్న డీసీ రవికుమార్

అత్తాపూర్: జీహెచ్ఎంసీ ఉద్యోగులు తమ కష్టాన్ని దాచుకోకుండా నిరంతరం పని చేస్తున్నారని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్ అన్నారు. బుధవారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి కమిషనర్ స్పందించారు. ఈ మేరకు బుధవారం ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు బాపూఘాట్ బ్రిడ్జి నుంచి అత్తాపూర్, హైదర్‌గూడ నలందనగర్, కాంతరెడ్డినగర్ ప్రాంతాలను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాపుఘాట్ బ్రిడ్జి సమీపంలో ఉన్న సమస్యను త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. గుంతలుగా ఏర్పడిన ప్రాంతంలో ప్యాచ్ వర్క్ చేస్తామని ఆయన తెలిపారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తూ కొందరు మూసీనది దాని పరివాహక ప్రాంతాల్లో వ్యర్థాలు, గాజు సీసాలు వేస్తున్నారని అన్నారు. దీని వల్ల జీహెచ్ఎంసీ సిబ్బంది గాయాల పాలవుతున్నారని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శాస్త్రిపురం: కొంత కాలంగా సరైనా సీసీరోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న సులేమాన్‌నగర్ డివిజన్ ఎంఎంపహడీ ప్రజలు ఇబ్బందులు తీరనున్నాయి. బుధవారం ఎంఎం పహాడీలో 999హోటల్ బస్తీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ంఎంసీ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టాలని ఆకాంక్షించారు.



ప్రైవేట్ ట్యాంకర్స్ ఓనర్ల సమస్యలను పరిష్కరించాలి



జలమండలి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రైవేట్ ట్యాంకర్స్ ఓనర్లు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని జలమండలి ప్రైవేట్ ట్యాంకర్స్ ఓనర్స్ బుధవారం జలమండలి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్యాంకర్లను బంద్ చేసి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కొన్ని నెలలుగా వాటర్ ట్యాంకర్ సరఫరా బిల్లులను సకాలంలో చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీని కారణంగా తాము ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5 నుంచి రాత్రి 8గంటల వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. దానిని ఉదయ 5గంటల నుంచి సాయంత్రం 5గంటలకు కుదించాలని విజ్ఞప్తి చేశారు.

నెలకు రూ.10వేలు చలాన్‌లకే పోతున్నాయి...

రోడ్డు పక్కనే ఫిల్లింగ్ స్టేషన్ ఉండటంతో రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారంటూ ట్రాఫిక్ పోలీసులు తమను వేధిస్తున్నారని తెలిపారు. రోజు విడిచి రోజు తమ ట్యాకర్లకు చాలనాలు విధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి నెల రూ10వేల వరకు చలాన్లకు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జలమండలి మేనేజర్‌తో సమావేశమయ్యారు. తమ సమస్యలను జీఎంకు వివరించారు. ఆయా సమస్యలపై తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ ధర్నా కార్యక్రమంలో 21 మంది ట్యాంకర్ డ్రైవర్ల యజమానులు వారి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం





మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లోని శ్రీసీతారామచంద్ర స్వామి, అభయాంజనేయ స్వామి ద్వితీయ వార్షికోత్సవ పూజలలో భాగంగా బుధవారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. వేదమంత్రోచ్చరణ, మంగళ వాయిద్యాల మధ్య అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. అంతకు ముందు సుప్రభాత సేవ, శాంతిపాఠం, వేద విన్నపాలు, కుంబారాధన, నిత్యాహవనం, శ్రీసుదర్శన హవనం, నిత్యపూర్ణాహుతి పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, బలి హరణ, హారతి పూజలను నిర్వహించారు. కల్యాణోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం



ఆరాంఘర్ చౌరస్తాలో నిరసన ర్యాలీలో కార్మికులు, జైపాల్‌రెడ్డి తదితరులు

రాజేంద్రనగర్: కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కార్మికులకు రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఆనంద్ ఆధ్వర్యంలో కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా బుధవారం ఆరాంఘర్ చౌరస్తాలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జైపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాల కారణంగా పేదరికం, అసమానతలు, ఆకలి, నిరుద్యోగం పెరిగిందన్నారు. కానీ కార్పొరేట్ కంపెనీల ఆస్తులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయని ఆరోపించారు.

అమల్లోకి వస్తే సంఘం పెట్టుకునే హక్కు కూడా ఉండదు..

ఈ ఏడాది నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. కార్మిక కోడ్‌లు అమల్లోకి వస్తే 8గంటల పనిదినం, కనీస వేతనాలు, సామాజిక భద్రత, కార్మికుల సంఘం పెట్టుకునే హక్కు లేకుండా పోతుందని తెలిపారు. సంఘాల రిజిస్ట్రేషన్-గుర్తింపు, సమష్టి బేరసారాల హక్కు, సమ్మె హక్కు, ఆందోళనలు చేసే హక్కులన్నీ తీవ్ర ప్రమాదంలో పడిపోతాయని పేర్కొన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను రద్దు చేయడానికి కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. రాజ్యాంగ స్ఫూర్తిని, సుప్రీంకోర్టు తీర్పులను ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ మార్గదర్శకాలను భూస్థాపితం చేయడమే పనిగా పెట్టుకుందన్నారు.

రూ.26వేలు కనీస వేతనం.. 8గంటలు పనిదినం

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం, 8 గంటల పనిదినం ఉండాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఆశా, అంగన్‌వాడీ తదితర స్కీమ్ వర్కర్లను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశ నిర్వహణ, మరికొన్ని డిమాండ్ల సాధనే ఈ సమ్మె ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ గ్రేటర్ అధ్యక్షుడు చెన్నయ్య, రాజేంద్రనగర్ మండల అధ్యక్షుడు సాయిలు, నాయకులు రాజు, శ్రీకాంత్, శ్రీకాంత్, ఎల్లప్ప, వెంకటేశ్, శేఖర్, విక్రం, అరుణ్, పెంటయ్య, నరసింహులు, నిరంజన్, మల్లారెడ్డి, కార్తీక్, శోభ, సునీత, లక్ష్మి, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్

మణికొండ: దశాబ్దాలుగా పోరాటం చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను ఉన్నపలంగా తొలగించి పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇకనైనా నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ డిమాండ్ చేశారు. సీపీఐ నేత పుస్తకాల నర్సింగ్‌రావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్‌తో కలిసి నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ఏఐటీయూసీ, సీఐటీయూల ఆధ్వర్యంలో ర్యాలీలు, అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలను సమర్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ... కార్మికులకు పని గంటలను పెంచి కనీస వేతన పద్ధతిని తొలగించటం దారుణమని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మల్లేష్, మాజీ కౌన్సిలర్ ఉషారాణి, నాయకులు వినోద్, కిరణ్, శంకరయ్య, బాబు, మాదవ్, వెంకటప్ప, రాజు, భాస్కర్, మోహన్, మహిపాల్, జనార్దన్ రెడ్డి, శంకరమ్మ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



నార్సింగిలో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్, ఏఐటీయూసీ నాయకులు



నార్సింగిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు